

తెలంగాణ అభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐలు కీలకం

- 8లో

రాష్ట్ర అభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐలు కీలకమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు.



నవాబ్ అలీ సేవలు చిరస్మరణీయం

ఇంజనీర్ నవాబ్ అలీ సేవలు చిరస్మరణీయమని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు అన్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం 34.5^{0} / 23.2^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర బృందం పర్యటన



మరిపెడ రూరల్: మరిపెడ మండలం తండధర్మారం గ్రామంలో రాష్ట్ర పరిశీలన బృందం మంగళవారం పర్యటించింది. జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం అందించే స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023అవార్డు సర్వేలో భాగంగా రాష్ట్ర పరిశీలకుడు నాగభూషణం ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించి అంగన్‌వాడీ కేంద్రం, గ్రామంలోని సైడ్ డ్రెయినేజీ వ్యవస్థ, గ్రామ పంచాయతీ కార్యాలయం, అంతర్గత సీసీ రోడ్లు, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం, ఇంటింటా మరుగుదొడ్లు తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామ అభివృద్ధికి దోహదపడే అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు పరిశీలకుడు నాగభూషణం తెలిపారు. ఈ కార్యక్రమంలో మరిపెడ ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు, ఎంపీడీఓ కేలోతు ధన్‌సింగ్, మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న, సర్పంచ్ గుగులోతు లక్ష్మిలక్‌పతి, ఇన్‌చార్జ్ ఎంపీఓ రామకృష్ణ, కార్యదర్శులు లెనిన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి



మహబూబాబాద్ అర్బన్: సీఎం కేసీఆర్ మానుకోట మున్సిపల్ అభివృద్ధికి కేటాయించిన రూ.50కోట్ల ఎస్‌డీఎఫ్ నిధుల పనులు త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే శంకర్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. మానుకోటను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతీ వార్డుకు అభివృద్ధి నిధులు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఎండీ ఫరీద్, కౌన్సిలర్లు వెన్నం లక్ష్మారెడ్డి, సూర్లపు సోమయ్య, అజయ్‌సారథిరెడ్డి, మార్నేని వెంకన్న, చిట్యాల జనార్దన్, పోతురాజు రాజు, బాలు నాయక్, నాయకులు గద్దె రవి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, జన్ను మహేందర్, కర్పూరపు గోపి, రఘు, శివ, శంకర్, ఖలీల్, రావీష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలల్లో నాణ్యమైన విద్య



మహబూబాబాద్ అర్బన్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని డీటీడీఓ ఎర్రయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పత్తిపాక గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. పాఠశాలల పరిసరాలతో పాటు విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కిషన్ నాయక్, ఉపాధ్యాయులు, వార్డెన్, విద్యార్థులు పాల్గొన్నారు.

డీటీ కారు డ్రైవర్.. కంప్యూటర్ ఆపరేటర్ విధులు

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు




నెల్లికుదురు: ఆయన డిప్యూటీ తహసీల్దార్ కారు డ్రైవర్.. చేపట్టేది మాత్రం కంప్యూటర్ ఆపరేటర్ విధులు.. వినడానికి కొత్తగా ఉన్నా.. ఇది నిజం. జిల్లాలోని నెల్లికుదురు మండల డిప్యూటీ తహసీల్దార్ తరంగిణి కారు డ్రైవర్ రంజిత్ వారంరోజులుగా కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో సర్టిఫికెట్ల ఆన్‌లైన్‌కు విద్యార్థుల నుంచి డబ్బులు దండుకుంటున్నాడు. పైసలు ఇవ్వని వారి సర్టిఫికెట్లను పక్కకు పడేస్తున్నట్లు బాధిత విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అలాగే సర్టిఫికెట్లలో తప్పులు దొర్లుతున్నట్లు తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ యోగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ తరంగిణిని వివరణ కోరగా.. సిబ్బంది కొరత కారణంగా డ్రైవర్‌తో సర్టిఫికెట్ల ఆన్‌లైన్ చేయించామని, మరోసారి పునరావృతం కాకుండా చూస్తామని తెలిపారు.

స్తంభాలు నాటుడే.. లైన్లు గుంజుడే!

పోడు భూములకు విద్యుత్ కనెక్షన్లు

- జిల్లాలో 22వేల పైచిలుకు పంపుసెట్లకు అవకాశం
- త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలని సీఎం కేసీఆర్ ఆదేశం
- అంచనాలు వేస్తున్న ఎన్పీడీసీఎల్
- పోడు రైతులకు తీరనున్న కష్టాలు

రాళ్లు, రప్పలు, చిన్నచిన్న గుట్టలను తొలగించి పోడుభూములను సాగు చేసుకుంటున్న గిరిజన, ఆదివాసీ రైతులకు ప్రభుత్వం ఇటీవల పట్టాలు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఏళ్లుగా వర్షాధార పంటలే పండిస్తున్న పోడు రైతులు బోర్లు, బావుల ద్వారా వ్యవసాయం చేసుకునేలా పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వనున్నారు. దీంతో రెండు పంటలకు సాగునీరంది మంచి దిగుబడులు సాధించి, ఆర్థిక పరిపుష్టి సాధించనున్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించగా.. ఎన్పీడీసీఎల్ అధికారులు అంచనా వేసే పనిలో నిమగ్నమయ్యారు.



సాక్షి, మహబూబాబాద్: పోడు రైతులకు మంచిరోజులు వచ్చాయి. ఇటీవల పట్టాదారు పాసు పుస్తకాలు అందగా.. ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి బోర్లు, బావుల నుంచి సాగునీటి సరఫరా జరిగేలా పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించనుంది. ఈమేరకు ఎన్పీడీసీఎల్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇంతటితో ఆగకుండా గిరి వికాస్ పథకం ద్వారా భూమి అభివృద్ధి పనులు కూడా చేపట్టనున్నారు.

కసరత్తు..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రత్యేక దృష్టితో 2006లో సర్వే చేయించి ఉమ్మడి వరంగల్ జిల్లాలో 14,016 మంది గిరిజన కుటుంబాలకు 41,315 ఎకరాల పట్టాలు అందజేశారు. అలాగే గత నెల 30న రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్, గిరిజన, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా గిరిజన, ఆదివాసీ పోడు రైతులకు పట్టాలు అందజేశారు. కాగా ఈ భూములకు సాగునీటి సౌకర్యం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకున్న సీఎం కేసీఆర్ పట్టాలు పంపిణీ చేసిన చోట బోర్లు, బావుల ద్వారా పంటలు సాగు చేసుకునే విధంగా ఉచిత విద్యుత్ కూడా అందించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జిల్లాలోని కొత్తగూడ, గంగారం, గూడూరు, బయ్యారం, గార్ల, నెల్లికుదురు, కురవి, మహబూబాబాద్, కేసముద్రం మండలాల్లోని పోడు భూములకు 22వేల పైచిలుకు పంపుసెట్లు ఉన్నట్లు సచారం. వీటికి త్వరలోనే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయనున్నారు.

అధికారుల అంచనాలు..

ఏజెన్సీ ప్రాంతాల్లో పోడు పట్టాలు పొందిన రైతులకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేందుకు సూచనప్రాయంగా సమాచారం సేకరించినట్లు తెలిసింది. జిల్లాలో 22వేల పైచిలుకు పంపుసెట్లకు విద్యుత్ సరఫరా చేయాలి. ఇందుకు సుమారుగా 60వేల మేరకు విద్యుత్ స్తంభాలు వేయాల్సి ఉంటుంది. అదేవిధంగా 300కిలో మీటర్ల పొడవు వరకు లైన్లు వేయాలి. ఇందుకోసం 100 మెగావాట్ల విద్యుత్ అదనంగా వినియోగించనున్నారు. విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలంటే సరిపడా సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి. ఇందుకు అయ్యే ఖర్చును ఏ నిధుల నుంచి వెచ్చించాలి అనేది చర్చిస్తున్నారు. కాగా ఏజెన్సీలోని పోడు రైతులకు ఉచిత విద్యుత్‌తో పాటు, గిరి వికాస్ పథకంలో భూముల అభివృద్ధి చేయనున్నారు.

త్రీఫేజ్ కనెక్షన్ల వివరాలు (అంచనా)

మండలం	కనెక్షన్ల సంఖ్య
కొత్తగూడ	6,296
గంగారం	3,800
గూడూరు	4,200
బయ్యారం	4,600
కేసముద్రం	2,015
గార్ల	412
కురవి	08
నెల్లికుదురు	260
మహబూబాబాద్	913
మొత్తం	22,504

విద్యుత్ సౌకర్యం కల్పించాలి



ఏళ్లుగా సాగు చేసుకుంటున్న రెండు ఎకరాల భూమికి ఇప్పుడు పట్టా వచ్చింది. ఆ భూమే మాకు జీవనాధారం. ఈ భూమిలో బావి తీసుకొని పంట సాగు చేద్దామనుకుంటున్న. మాకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది. ముఖ్యమంత్రి సారు కరెంట్ ఇస్తామని అనడం టీవీలో చూసిన. మాకు కరెంట్ ఇస్తే పంటలు పండించుకుంటాం.

– భూక్య కాంతి, మహిళా పోడు రైతు, బాల్యాతండా, బయ్యారం

ఘనంగా 'దాటుడు' పండుగ

జిల్లా వ్యాప్తంగా గిరిజనులు దాటుడు (సీత్లా భవాని) పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కుటుంబ సమేతంగా సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతూ ఏటా వర్షాకాలంలో పుష్యమికార్తెలో వచ్చే మంగళవారం రోజున ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. కాగా గిరిజనులు యాటలు, కోళ్లను లుంకిడియా విగ్రహం వద్ద బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. యాటల పేగుల మీదుగా పశువులను దాటించి.. పశుసంపదను చల్లంగా చూడు తల్లీ అంటూ వేడుకున్నారు.

– సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్/ మహబూబాబాద్ రూరల్



నైవేద్యంతో వెళ్తున్న యువతి





జలాభిషేకం చేస్తున్న మహిళలు, బలి ఇచ్చిన గొర్రెల పేగులపై నుంచి పశువులను దాటిస్తున్న గిరిజనుడు



మానుకోట మండలం దామ్యతండాలో నైవేద్యంతో తరలివెళ్తున్న యువతులు

- మరిన్ని ఫొటోలు 9లో

పంటల నమోదు పరిశీలన

కేసముద్రం: కొత్తయాప్(జీటీ పాయింట్) ద్వారా ప్రయోగాత్మకంగా మండలంలోని పెనుగొండ గ్రామంలో మంగళవారం చేపట్టిన వర్షాకాలం పంటల నమోదు కార్యక్రమాన్ని డీఏఓ ఛత్రునాయక్, సాంకేతిక వ్యవసాయ అధికారి సారయ్య పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్త యాప్ ద్వారా వర్షాకాలంలో రైతులు సాగుచేసే పంటల వివరాలు సర్వే నంబర్ల వారీగా నమోదు అవుతాయన్నారు. దీంతో పంటను అమ్ముకునేటప్పుడు మార్కెటింగ్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ వెంకన్న, ఏఈఓ రహీంపాషా, రైతులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న డీఏఓ ఛత్రునాయక్

జనాభా కట్టడికి సహకరించాలి

నెహ్రూసెంటర్: ప్రజలందరూ జనాభా పెరుగుదలపై అవగాహన కలిగి ఉండి, కట్టడికి సహకరించాలని డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా ఆస్పత్రి నుంచి నెహ్రూసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడారు. జనాభా పెరుగుదల వల్ల కలిగే అవసరాలు, అనర్థాలు, సామాజిక అసమానతలపై వివరించారు. నిరక్షరాస్యత, బాల్య వివాహాలు, పెళ్లి జరిగిన వెంటనే పిల్లలను కనడం, కాన్పుకు కాన్పుకు మధ్య ఎడం లేకపోవడం వంటివి జనాభా పెరుగుదలకు ప్రధాన కారణాలన్నారు. ప్రతి ఒక్కరూ జనాభా పెరుగుదలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కుటుంబ నియంత్రణ పాటించిన వారిని సన్మానించి వెయ్యి రూపాయల పారితోషికం అందజేశారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలందించిన డాక్టర్లు, స్టాఫ్‌నర్సులను డీఎంహెచ్ఓ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ ఉమాగౌరి, అంబరీష, పీఓ సుధీర్‌రెడ్డి, డిప్యూటీ డెమో కేవీ రాజు, సీహెచ్ఓ కృష్ణార్జునరావు, హెల్త్‌ఎడ్యుకేటర్ మహేందర్‌రెడ్డి, పురుషోత్తం, గీత, డీపీఎంఓ వెన్నా, డీపీహెచ్ఎన్ఓ మంగమ్మ, డీపీఓ రుక్ముద్దీన్, వైద్యులు, ఆశకార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సన్మానించిన డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్

ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలి

నెహ్రూసెంటర్: ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల కోసం పోరాడితే అక్రమంగా కేసులు బనాయించి జైలుకు పంపడం సరికాదన్నారు. వేల ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి, భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సీపీఎం ఆధ్వర్యంలో అనేక చోట్ల భూపోరాటాలు కొనసాగుతున్నాయని, మానుకోట జిల్లా కేంద్రంలో మాత్రం పేద ప్రజలపై దాడులు కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజా పోరాటాలను ఉధృతం చేసి ఇళ్ల స్థలాలు దక్కే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కేంద్రంలో జరిగిన భూపోరాటంలో పాల్గొని జైలుకు వెళ్లి వచ్చిన మహిళలను పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సమ్మెట రాజమౌళి, కుర్ర మహేష్, నాయకులు బానోత్ సీతారాంనాయక్, అల్లి శ్రీనివా స్‌రెడ్డి, రావుల రాజు, చీపిరి యాకయ్య, తోట శ్రీనివాస్, చాగంటి బాగ్యమ్మ, బానోత్ వెంకన్న, యమగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

సౌకర్యాలను వినియోగించుకోవాలి

- పాఠశాలలను తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ అంకిత్

గంగారం: రాష్ట్ర ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ఏటూరునాగారం పీఓ అంకిత్ అన్నారు. మండలంలోని ఆశ్రమోన్నత, మడగూడెం బాలుర పాఠశాలలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల స్టడీ అవర్స్, ఏకరూప దుస్తులు, నోట్‌బుక్స్, షూ మొదలైన వాటి సరఫరాపై ఆరా తీశారు. టిఫిన్, మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలలో మరమ్మతు పనులు, తాగునీటి లభ్యత, మిషన్ భగీరథ నీటి సరఫరాను పరిశీలించారు. అలాగే కిచెన్ షెడ్‌ను పరిశీలించి మిగిలిన పనులు పూర్తి చేయాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. బడిబాట లక్ష్యం, ఈ ఏడాది చేరిన విద్యార్థుల సంఖ్య, పదో తరగతి విద్యార్థుల వివరాలు, గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం తదితర అంశాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏటీడీఓ భాస్కర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంరెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఈరులాల్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ

పోడు రైతులకు రైతుబంధు అందాలి

- కలెక్టర్ శశాంక

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని పోడు పట్టాలు పొందిన గిరిజన, ఆదివాసీ రైతులకు రైతుబంధు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైతుబంధు పథకంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 20వేలకు పైగా పోడు రైతులు రైతుబంధు పథకానికి అర్హత సాధించారని, వారందరి ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని ఆదేశించారు. వారి బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్, మొబైల్ నంబర్లు సేకరించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ డేవిడ్, సహాయ కలెక్టర్ పింకేశ్‌కుమార్, డీఏఓ ఛత్రునాయక్, డీటీడీఓ ఎర్రయ్య, ఏడీఏలు లక్ష్మీనారాయణ, శోభన్‌బాబు, వ్యవసాయ శాఖ పరిపాలన అధికారి నరేందర్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

క్రమబద్ధీకరణకు నగదు చెల్లించాలి..

59జీఓ ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న వారిచే తప్పనిసరిగా నగదు కట్టించాలని కలెక్టర్ శశాంక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థలాల క్రమబద్ధీకరణపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. 59జీఓ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు.

పనులు పూర్తి చేయాలి..

నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మానుకోట మున్సిపాలిటీలో రూ.50కోట్లతో చేపడుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జీపీల్లో అభివృద్ధి పనులను వేగిరం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, సీపీఓ సుబ్బారావు, ఆయా శాఖల అధికారులు నరేష్, సురేష్, తానేశ్వర్, హేమలత, ఉమా మహేష్, మహబూబాబాద్ తొర్రూరు, డోర్నకల్, మరిపెడ మున్సిపల్ కమిషనర్లు ప్రసన్నరాణి, సరస్వతీ, మున్వర్ అలీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురికి రివార్డులు

మహబూబాబాద్ రూరల్: జిల్లా పోలీస్‌శాఖలో ఉత్తమ సేవలు అందించిన ఆరుగురిని రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తమ సేవా పతకం, సేవా పతకం రివార్డులకు ఎంపిక చేశారు. ఉత్తమ సేవా పతకానికి ఏఆర్ డీఎస్పీ రేల జనార్దన్‌రెడ్డి, సేవా పతకానికి ఎస్కే.యాకూబ్‌అలీ (ఏఎస్సై, డీసీఆర్బీ, మహబూబాబాద్), ఏ.సూరయ్య (ఏఆర్ ఎస్సై, డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డ్ రిజర్వ్, మహబూబాబాద్), కె.వెంకన్న(ఏఎస్సై, నెల్లికుదురు పోలీస్‌స్టేషన్), ఎల్.రవీందర్ (ఏఎస్సై, గార్ల పోలీస్‌స్టేషన్), టి.దేవా (హెడ్ కానిస్టేబుల్, మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్)ను ఎంపిక చేస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వీరందరినీ రివార్డులకు ఎంపిక చేసినట్లు తెలిసింది.

డ్రైవర్ విధుల్లో సర్పంచ్



డోర్నకల్: గ్రామ పంచాయతీ సిబ్బంది విధులను బహిష్కరించి సమ్మెబాట పట్టడంతో పలు గ్రామాల్లో సర్పంచులు వారి స్థానాలను భర్తీ చేస్తున్నారు. మండలంలోని తెల్లబండతండా సర్పంచ్ గుగులోత్ శ్రీను గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ పారిశుధ్య పనుల్లో పాల్గొంటున్నాడు.

శిలాఫలకం ధ్వంసం

కురవి: అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల కార్యక్రమానికి హాజరయ్యేందుకు మంగళవారం అయ్యగారిపల్లి గ్రామానికి వచ్చారు. కాగా గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని సోమవారం సాయంత్రం ఏర్పాటు చేశారు. అభివృద్ధి పనులను చూసి ఓర్వలేని గుర్తు తెలియని వ్యక్తులు అదేరోజు రాత్రి శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. శిలాఫలకం అమర్చేందుకు నిర్మించిన గోడను సైతం ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఈ విషయాన్ని గమనించి అప్పటికప్పుడు కొత్త శిలాఫలకాన్ని తెప్పించి ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ ఘటనపై బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.



పక్కకు పడేసిన ధ్వంసమైన శిలాఫలకం

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో అంగన్‌వాడీ కోడిగుడ్లు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో అంగన్‌వాడీ కోడిగుడ్లతో ఎగ్ ఫ్రైడ్‌రైస్, ఎగ్ నూడిల్స్ తయారు చేసిన ఘటన మంగళవారం వెలుగుచూసింది. అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేసే కోడిగుడ్లు పక్కదారి పట్టకుండా స్టాంప్‌లు వేస్తున్నారు. అయితే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో స్టాంప్ వేసి ఉన్న కోడిగుడ్లతో ఫాస్ట్‌ఫుడ్ తయారు చేసిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా అవకతవకలు జరుగుతున్నాయడానికి ఈ ఘటనే నిదర్శనమని, ఇప్పటికైనా ఐసీడీఎస్ అధికారులు పర్యవేక్షణ పెంచి, తనిఖీలు విస్తృతం చేయాలని నెటిజన్లు, జిల్లా ప్రజలు కోరుతున్నారు.



వాడిపడేసిన అంగన్‌వాడీ కోడిగుడ్లు

కమిషనరేట్ పరిధిలో పోలీస్ అధికారుల బదిలీలు

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇన్‌స్పెక్టర్లు..

వెంకటరత్నం వీఆర్ నుంచి పరకాల, పి.కిషన్ పరకాల నుంచి వీఆర్, కె.రామకృష్ణ కాజీపేట ట్రాఫిక్ నుంచి గీసుగొండకు ఎస్.రాజు గీసుగొండ నుంచి వీఆర్‌కు బదిలీ చేశారు.

సబ్ ఇన్‌స్పెక్టర్లు..

డి.విజయ్‌కుమార్ హసన్‌పర్తి నుంచి రాయపర్తి, డి.రాజు వీఆర్ నుంచి టాస్క్‌ఫోర్స్, ఎల్.కొంరెల్లి కొడకండ్ల నుంచి ఇంతేజార్‌గంజ్, వి.నవీన్‌కుమార్ దుగ్గొండి నుంచి ఐనవోలు , జి.వెంకన్న ఐనవోలు నుంచి ఇంతేజార్‌గంజ్, ఈ.వీరభద్రరావు శాయంపేట నుంచి పర్వతగిరి, డి.దేవేందర్ పర్వతగిరి నుంచి కమాలాపూర్, ఈ.నర్సింహారావు మడికొండ నుంచి టాస్క్‌ఫోర్స్, ఆర్.రణధీర్ కాజీపేట ట్రాఫిక్ నుంచి వరంగల్ ట్రాఫిక్, ఆర్.రామారావు వరంగల్ ట్రాఫిక్ నుంచి కాజీపేట, జే.నాగరాజు ఇంతేజార్‌గంజ్‌నుంచి స్టేషన్ ఘన్‌పూర్, వంశీకృష్ణ వీఆర్ నుంచి టాస్క్‌ఫోర్స్, కె.కిషోర్ వీఆర్ నుంచి హసన్‌పర్తి, వి.చరణ్‌కుమార్ కమాలాపూర్ నుంచి వీఆర్, ఎండీ రవూఫ్ వీఆర్ నుంచి ఎస్సై -2 పాలకుర్తికి బదిలీ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్‌ఎఫ్‌ఓకు శౌర్య పతకం


గ్రేటర్ వరంగల్ ఆర్‌ఎఫ్‌ఓ పాపయ్య

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ రీజినల్ ఫైర్ ఆఫీసర్(ఆర్‌ఎఫ్‌వో) వి.పాపయ్యకు రాష్ట్ర ప్రభుత్వం శౌర్య పతకం ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు వెల్లడించింది. సికింద్రాబాద్‌లోని డెక్కన్ మాల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో అసమాన ధైర్యం చూపి పలువురి ప్రాణాలను కాపాడిన నేపథ్యంలో పాపయ్యకు ప్రభుత్వం ప్రతిష్టాత్మక శౌర్య పతాక అవార్డును ప్రదానం చేయనుంది.

లీడింగ్ ఫైర్‌మెన్ రవీందర్‌కు..


రవీందర్

వరంగల్ : వరంగల్ అగ్నిమాపక కేంద్రంలో లీడింగ్ ఫైర్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.రవీందర్‌కు తెలంగాణ అగ్నిమాపక శాఖ ఉత్తమ సేవా పతకం ప్రకటించింది. 1987లో ఉద్యోగంలో చేరిన రవీందర్ 2017 సేవా పతకం అందుకున్నారు. ఇప్పటి వరకు 36 ఏళ్లుగా శాఖలో సేవలు అందించినందుకు ప్రభుత్వం ఉత్తమ సేవా పతకం ప్రకటించిందని డీఎఫ్‌ఓ భగవాన్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్తమ సేవా పతకం అందుకున్న రవీందర్‌ను అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

తెలంగాణ అభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐలు కీలకం

- అమెరికా, ఇండియా వారధులు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


అమెరికాలో సాయిదత్త ఆలయంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి /దేవరుప్పుల : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ఎన్‌ఆర్‌ఐలు కీలకమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రం ఫిలడెల్ఫియాలో 'తానా' సభలకు వెళ్లిన మంత్రి ఎర్రబెల్లి.. సాయి దత్త ఆలయాన్ని సందర్శించగా అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్‌ఆర్‌ఐ 'మీట్ అండ్ గ్రీట్' లో మాట్లాడుతూ ఉన్నత విద్య కోసం వచ్చి స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐలు జన్మభూమిపై మమకారం చూపడం వల్లే దేశం, రాష్ట్రం పలు రంగాల్లో పురోగతి సాధిస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని, మరింత అభివృద్ధి సాధించడానికి అమెరికా, ఇండియా వారధులుగా ఎన్‌ఆర్‌ఐలు తోడ్పాటు అందించాల్సి ఉందన్నారు.

పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై ఎర్రబెల్లి ఆగ్రహం

సీఎం కేసీఆర్.. రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్ ఇస్తుంటే.. 3 గంటల విద్యుత్ చాలని అమెరికాలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలు చేపడుతుంటే హర్షించేదిపోయి ఎల్లలు దాటినా రాజకీయ ఉనికి కోసం అర్థరహిత విమర్శలు తగవన్నారు. రైతు పక్షపాతి పాలన కొనసాగిస్తున్న ఘనత దేశంలో సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

రోడ్డుపై వాహనాల తొలగింపు..

సాక్షి ఎఫెక్ట్..


వాహనాలను తొలగించడంతో విశాలంగా ఉన్న రహదారి

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌లో టమాట బాక్స్‌లను తీసుకొచ్చిన డీసీఎంలు రోడ్డుపై అడ్డదిడ్డంగా నిలపడంతో వ్యాపారులు, వినియోగదారులు పడుతున్న ఇబ్బందులపై సోమవారం 'సాక్షి' దినపత్రికలో 'దారి చూపరూ' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మార్కెట్ అధికారులు స్పందించారు. మంగళవారం మార్కెటింగ్‌శాఖ అధికారులు డీఎంవో ప్రసాదరావు, మార్కెట్ కమిటీ కార్యదర్శి బీవీ రాహుల్, గ్రేడ్-2 కార్యదర్శి రాములు సందర్శించి అడ్డుగా ఉన్న డీసీఎంలను తొలగించారు. ఈ సందర్భంగా డీఎంవో ప్రసాదరావు మాట్లాడుతూ కూరగాయల మార్కెట్‌లో వినియోగదారులు రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. టవర్ వద్ద నిలుపుతున్న వాహనాలతోపాటు రోడ్డుకు ఇరుపక్కల ఉన్న చిల్లర వ్యాపారులను సైతం క్రమబద్ధీకరిస్తున్నామన్నారు. రెండు రోజుల్లో చిల్లర వ్యాపారులు క్రమపద్ధతిలో విక్రయాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్.. రెండు గంటలు ఆలస్యం

- ఇబ్బందులు పడిన ప్రయాణికులు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌కు మంగళవారం రాత్రి సికింద్రాబాద్ నుంచి సిర్పూర్‌కాగజ్‌నగర్ వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రెండు గంటల ఆలస్యంతో చేరుకుంది. ఖమ్మం-విజయవాడ సెక్షన్‌లో రైల్వే ట్రాక్ మరమ్మతులు, మూడో లైన్ నిర్మాణం కారణంగా గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఉదయం గంట ఆలస్యంతో వెళ్లినట్లు రైల్వే అధికారులు తెలిపారు. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌యే తిరిగి భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌గా వెళ్తుందని తెలిపారు. దీంతో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం నిర్ణీత సమయం కన్నా సుమారు రెండు గంటల ఆసల్యంతో కాజీపేట జంక్షన్‌కు చేరుకుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

చేపల వేటకు వెళ్లి.. వృద్ధుడి మృతి

కేసముద్రం: చేపల వేటకు వెళ్లిన ఓ వృద్ధుడు.. సిమెంట్ పైపులైన్ కాలువలో ఊపిరాడక మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కోరుకొండపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన ఆనబత్తుల ఉప్పలయ్య(79) ఈనెల 6న చేపల వేటకు వెళ్లాడు. కాగా, చెరువు తూము సమీపంలో వేసిన సిమెంట్ పైపుల నుంచి నీళ్లు వెళ్తుంటాయి. ఈ క్రమంలో చేపలు పట్టేందుకు ఉప్పలయ్య ఆ సిమెంట్ పైపులైన్‌లోకి వెళ్లాడు. దీంతో ఊపిరాడక పైపులైన్‌లోనే మృతిచెందాడు. ఉప్పలయ్య తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికారు. మంగళవారం చెరువు వైపునకు వెళ్లిన స్థానికులకు దుర్వాసన రావడంతో కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు విజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ఓపీఎస్ అమలు చేయాలి

- వరంగల్ మార్కెట్ కమిటీ ఎస్‌జీఎస్ బీవీ రాహుల్


పోస్టర్లతో నిరసన తెలుపుతున్న మార్కెట్ ఉద్యోగులు

వరంగల్ : మార్కెట్ ఉద్యోగులకు కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపీఎస్)ను అమలు చేయాలని వరంగల్ మార్కెట్ కమిటీ ఎస్‌జీఎస్ బీవీ రాహుల్ అన్నారు. ఈమేరకు మంగళవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయం ఎదుట ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఉద్యోగులందరికీ ఓపీఎస్ అమలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేశాయన్నారు. అదే విధంగా తెలంగాణలో కూడా ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం టీఎన్‌జీఓస్(మార్కెటింగ్) జిల్లా అధ్యక్షుడు జన్ను భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు మామిండ్ల రాజేందర్, కార్యదర్శి జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు ఈ నిరసన చేపట్టామన్నారు. కార్యక్రమంలో కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు పి.అశోక్, వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులు ఎండీ బియబానీ, రాము, కృష్ణమీనన్‌రావు, శ్రీనివాస్‌రాజ్, నర్సింహానాయక్, కుమార్, కన్నయ్య, రమణ, స్వప్న, రాజేశ్వరి, పద్మ, లత తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీకి ఆటోమేషన్ అవసరం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, పింగిళి కళాశాల ప్రిన్సిపాల్,తదితరులు

- కేయూ వీసీ ఆచార్య రమేశ్

కేయూ క్యాంపస్: ప్రతి కళాశాలకు లైబ్రరీ ఆటోమేషన్ అవసరమని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి కళాశాల లైబ్రరీ విభాగం, ఐక్యూఏసీ సంయుక్తంగా ఈఏడాది ఆగస్టు 4, 5 తేదీల్లో నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్‌కు సంబంధించిన బ్రోచర్లను సోమవారం క్యాంపస్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైబ్రరీ ఆటోమేషన్‌పై నిర్వహించే ఈవర్క్‌షాప్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యూనివర్సిటీ పరిధిలోని అన్ని లైబ్రరీల్లో ఆటోమేషన్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ ఈవర్క్‌షాప్‌లో లైబ్రరీ ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, కేయూ పాలక మండలి సభ్యులు నాగేంద్రబాబు, మల్లారెడ్డి, ప్రొఫెసర్ మనోహర్, రిటైర్డ్ ఆచార్యులు సుమతిఉమా మహేశ్వరి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత రచనారాజిరెడ్డి, పింగిళి కళాశాల పరీక్షల నియంత్రణాధికారి రామకృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని,లైబ్రేరియన్ జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

నవాబ్ అలీ సేవలు చిరస్మరణీయం

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు


మాట్లాడుతున్న సీఎండీ గోపాల్‌రావు

హన్మకొండ : ఇంజనీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ సేవలు చిరస్మరణీయమని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్‌రావు అన్నారు. నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఇంజనీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ 146వ జయంతిని మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎండీ గోపాల్‌రావు.. నవాబ్ అలీ నవాజ్ జంగ్ చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నవాబ్‌అలీ నవాజ్ జంగ్ బహదూర్ పుట్టిన రోజును తెలంగాణ ఇంజనీర్స్‌డే గా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ చీఫ్ ఇంజనీర్‌గా ఉన్న కాలంలో ఆయన అనేక భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, వాటిని విజయవంతంగా నిర్మించారన్నారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చే హిమయత్ సాగర్, ఓయూ ఆర్ట్స్ కాలేజీ, ఉస్మానియా హాస్పిటల్, జూబ్లీహాల్, ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్ తదితర ఎన్నో చరిత్రాత్మక నిర్మాణాలను చేపట్టారని గుర్తుచేశారు. గోదావరి, మంజీరా నదులపై వంతెనల నిర్మాణాల్లో కీలక పాత్ర పోషించారని, అలాగే టెలిఫోన్ సౌకర్యం జిల్లాలకు విస్తరించేందుకు ఆయన చూపించిన చొరవ ఎనలేనిదన్నారు. నవాబ్‌అలీ జంగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని వినియోగదారులకు సంస్థలోని ప్రతి ఉద్యోగి నాణ్యమైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వరావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎంలు టి.సదర్‌లాల్, అశోక్‌కుమార్, టి.మధుసూదన్, మోహన్‌రావు, కిషన్, సి.ప్రభాకర్, రవీంద్రనాథ్, రాజు చౌహాన్, కెఎన్ గుట్ట, బికం సింగ్, జాయింట్ సెక్రటరీ కె.రమేశ్, జీఎంలు శ్రవణ్‌కుమార్, నాగప్రసాద్, గిరిధర్, వేణుబాబు, శ్రీకృష్ణ, సత్యనారాయణ, మనోహర స్వామి, దేవేందర్, వేణుబాబు, అన్నపూర్ణ, సత్యనారాయణ, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు



ములుగు: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వాక్యాలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించి అసత్య ప్రచారానికి తెరలేపారని ఎమ్మెల్యే సీతక్క మండిపడ్డారు. మంగళవారం సీతక్క ఫోన్ లో మీడియాతో మాట్లాడారు. దేశంలోనే మొదటి సారిగా రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. బీఆర్‌ఎస్ నేతలు లేనిపోని తప్పుడు ప్రచారాలను సృష్టించి మరో సారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారనీ అన్నారు. రైతులకు ఏక కాలంలో రైతు రుణమాఫీ చేస్తాం అని మోసం చేసింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారం లోకి రాగానే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ప్రకటించమని గుర్తు చేశారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమన్నారు. బీఆర్‌ఎస్ నాయకులకు కుక్కకు బొక్క దొరికినట్లు వ్యవహరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అమెరికాలో రేవంత్‌రెడ్డి రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం కాదు నాణ్యమైన 8 గంటల విద్యుత్ ఇస్తే సరిపోతుందనే వ్యాఖ్యలను బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించారని ఆమె ఆరోపించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని రాబోవు రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు..


గుప్తనిధుల కోసం గుట్టపై తవ్విన గొయ్యి

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి శివారు పాండవుల గుట్టపై గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. ఈ ఘటన గ్రామంలో కలకలం సృష్టించింది. వర్షాల కురవాలని కోరుకుంటూ ముదిరాజ్ కులస్తులు.. పాండవుల గుట్టపై తరచూ పూజలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా సోమవారం గుట్ట సమీపంలోకి కొందరు యువకులు వెళ్లగా తవ్వకాలు జరుపుతున్నట్లు శబ్ద వినపడింది. దీంతో గ్రామస్తులకు సమాచారం అందించగా వారు గుట్టపైకి చేరుకున్నారు. కొంతమంది పారిపోగా ఇద్దరు వ్యక్తులు, ఆటో, ద్విచక్ర వాహనం పట్టుబడ్డాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలికి చేరుకుని వాహనాలతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం ఘటనాస్థలాన్ని పరిశీలించగా వారం రోజుల నుంచి తవ్వకాలు జరుపుతున్నట్లు కనిపించింది. దీనిపై సీఐ ఉపేందర్‌రావును వివరణ కోరగా గుట్టపై గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపింది వాస్తవమేనన్నారు. తమ సిబ్బంది ఘటనా స్థలికి వెళ్లి ప్రాథమికంగా విచారణ జరిపారన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే పూర్తిస్థాయిలో విచారణ చేపడుతామని సీఐ తెలిపారు.

అదుపు తప్పి వాగులోకి దూసుకెళ్లిన కారు..

- వర్ధన్నపేట ఎస్సైకి తప్పిన పెను ప్రమాదం


ఆకేరు వాగులోకి దూసుకెళ్లిన కారు

వర్ధన్నపేట: వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు పెనుప్రమాదం తప్పింది. విధుల నిమిత్తం మంగళవారం తన సొంత కారులో డ్రైవ్ చేసుకుంటూ వరంగల్‌లోని తన నివాసం నుంచి వర్ధన్నపేటకు వస్తున్నాడు. ఈ క్రమంలో ఆకేరు వాగు బ్రిడ్జి ప్రారంభంలో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై కుక్క అడ్డు వచ్చింది. దీనిని తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి వాగులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బెలూన్ ఓపెన్ కావడంతో ఆయన ప్రమాదం నుంచి తృటిలో బయటపడ్డారు. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది.

ఆ పాప ఎవరు..? కథనంపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..


విచారణ చేస్తున్న అధికారులు

కాశోజీ సెంటర్ అమెరికా దంపతులు..వరంగల్‌కు చెందిన ఓ ఆరేళ్ల శిశువును దతత్త తీసుకునే అంశంపై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సీడబ్ల్యూసీ సభ్యులు, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు, ఏహెచ్‌టీయూ పోలీస్ , ఐసీడీఎస్ సూపర్‌వైజర్.. వరంగల్ పిన్నవారి వీధిలో ఉంటున్న ఆ కుటుంబం వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. వారి సమాచారం మేరకు వరంగల్ ములుగు రోడ్డులోని 'రియా' ఆస్పత్రిలో పాప బర్త్ వివరాలు, రికార్డులను తనిఖీ చేయగా అందుకు సంబంధించిన వివరాలు లేకపోవడంతో బుధవారం సీడబ్ల్యూసీ ఎదుట హాజరు కావాలని ఆదేశించినట్లు సమాచారం.

ఆవేదనతో అనంతలోకాలకు..

- వేర్వేరు కారణాలతో ముగ్గురి బలవన్మరణం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ కారణాలతో మనస్తాపం చెందిన ముగ్గురు మంగళవారం బలవర్మణం చెందారు. నర్సంపేట మండలం రాజుపేట శివారులో వ్యక్తి , కేసముద్రం మండలం ఇంటికన్నెలో యువకుడు, రేగొండ మండలం కనిపర్తిలో యువతి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

ఇంటికన్నెలో యువకుడు..


ప్రేమ్‌సాగర్(ఫైల్)

కేసముద్రం: మానసిక సమస్యతో బాధపడుతున్న ఓ యువకుడు.. జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని ఇంటికన్నె రైల్వేస్టేషన్‌లో జరిగింది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ రాజు కథనం ప్రకారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామానికి చెందిన జెల్ల యాకయ్య, ఉమ దంపతులకు కుమారుడు ప్రేమ్‌సాగర్(23), కూతురు ఉంది. ఇంటర్ వరకు చదువుకున్న ప్రేమ్‌సాగర్ కొద్దిరోజుల నుంచి మానసిక సమస్యతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆ యువకుడు.. మంగళవారం ఇంటికన్నె-నెక్కొండ రైల్వేస్టేషన్ల మధ్య 415/23-15 కిలోమీటర్ వద్ద అప్‌లైన్‌లో వెళ్తున్న గుర్తుతెలియని రైలు కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, మృతుడి శరీరభాగాలు ఛిద్రమై రైల్వేట్రాక్‌పై అక్కడకక్కడ పడ్డాయి. ఘటనా స్థలికి చేరుకున్న జీఆర్‌పీ పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

నర్సంపేట మండలం రాజుపేట శివారులో వ్యక్తి..


బుచ్చిరెడ్డి (ఫైల్)

నర్సంపేట రూరల్ : పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన నర్సంపేట మండలం రాజుపేట శివారులో జరిగింది. నల్లబెల్లి మండలం మామిండ్ల వీరయ్యపల్లి గ్రామానికి చెందిన ముసుగు బుచ్చిరెడ్డి (50) తనకున్న రెండున్నర ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో తరుచూ దంపతుల మధ్య గొడవలు జరగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం కూడా జరగడంతో బచ్చిరెడ్డి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. మంగళవారం సాయంత్రం నర్సంపేట మండలం రాజుపేట శివారులో పురుగుల మందు తాగి పడిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలికి చేరుకుని బుచ్చిరెడ్డిని నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. కాగా, మృతుడికి భార్య కవిత, ఇద్దరు కుమారులు అనిల్, హరీశ్ ఉన్నారు.

కనిపర్తిలో యువతి..


రమ్య(ఫైల్)

టేకుమట్ల(రేగొండ): ఉరివేసుకుని ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కనిపర్తిలో జరిగింది. గ్రామానికి చెందిన పడకంటి రాజు, రజిత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు రమ్య(22) ఉన్నారు. కాగా, రమ్య పరకాలలోని వాగ్దేవి కాలేజీలో బీఈడీ చదువుతోంది. ఈ క్రమంలో నాలుగు నెలల కిత్రం తండ్రి రాజు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే, రమ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రుల్లో చికిత్స అందించినా నయం కావడం లేదు. దీంతో తండ్రి లేక.. తల్లి, సోదరులను ఆర్థికంగా ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక మంగళవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై మృతురాలి తల్లి రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

దైవదర్శనానికి వెళ్లేందుకు వచ్చి.. మృత్యుఒడికి

- రెండు బైక్‌లు ఢీ
- ఒకరు దుర్మరణం.. ముగ్గురికి తీవ్ర గాయాలు


కిరణ్ మృతదేహం

నల్లబెల్లి: దైవ దర్శనానికి వెళ్లేందుకు అత్తారింటికి వచ్చిన ఓ వ్యక్తి.. రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం మండలంలోని నందిగామ శివారులో జరిగింది. గీసుగొండ మండలం మొగిలిచర్లకు చెందిన బండారి కిరణ్(24) దంపతులు బతుకుదెరువు నిమిత్తం చెన్నైకి వెళ్లారు. ఈ క్రమంలో వేములవాడ వెళ్లేందుకు మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి అత్తారింటికి వచ్చాడు. దైవదర్శనానికి అవసరమైన సామగ్రి తెచ్చుకునేందుకు తన వద్ద పనిచేసే ఆదిలాబాద్‌కు చెందిన వేముల ప్రశాంత్‌తో కలిసి బైక్‌పై మండల కేంద్రానికి వెళ్లి తిరిగి నందిగామకు వస్తున్నాడు. ఈ క్రమంలో నందిగామ శివారులోని సబ్ స్టేషన్ వద్ద.. రేలకుంట గ్రామానికి చెందిన అక్కపల్లి అజయ్, కొత్తురు భిక్షపతి ద్విచక్రవాహనపై నల్లబెల్లి వైపు వస్తున్నారు. ఈక్రమంలో ఇరువురి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కిరణ్ అక్కడికక్కడే మృతి చెందగా ప్రశాంత్, అజయ్, భిక్షపతికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలికి పోలీసులు చేరుకుని మృతహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్ నగేశ్ తెలిపారు.